## క్లుప్తంగా

### విద్యుత్ సర్వీస్‌కు ఆధార్ తప్పనిసరి

**మండపేట:** విద్యుత్ సర్వీస్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా చేయించుకోవాలని విద్యుత్ శాఖ రామచంద్రపురం డివిజన్ ఈఈ ఎం.విజయానంద్ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ యాప్ ద్వారా కాని, విద్యుత్ ఉద్యోగులు, విద్యుత్‌బిల్లుల చెల్లింపు కేంద్రాలు, ఏఈ కార్యాలయంలో కాని ఆధార్ అనుసంధానం చేయించుకోవాలని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

### 29న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

**మండపేట:** మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఈనెల 29వ తేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి తెలిపారు. పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై ఈ సమావేశంలో చర్చిస్తామన్నారు. కౌన్సిలర్లు, అధికారుల హాజరు కావాలని చైర్‌పర్సన్ దుర్గారాణి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

### రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు

**కాజులూరు:** మండలంలోని గొల్లపాలెం, కుయ్యేరు రహదారిలో బందనపూడి ఊటచెరువు సెంటర్ వద్ద ఆదివారం ఒక స్కూటరిస్టు అదుపుతప్పి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాకినాడకు చెందిన సలాది గోవిందరాజులు తన స్కూటర్‌పై కాజులూరు వచ్చి తిరిగి వెళ్లుతుండగా ప్రమాదవశాత్తూ అదుపుతప్పి ఊటచెరువు సెంటర్ వద్ద రోడు పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. ఈ సంఘటనలో అతను తీవ్ర గాయాలపాలవగా స్థానికులు గమనించి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### మృతుడి కుటుంబానికి పృథ్వీరాజ్ పరామర్శ

**కపిలేశ్వరపురం:** కొత్తపేట పంట కాలువలో జారిపడి మృతి చెందిన కపిలేశ్వరపురం మండలంలోని కేదారిలంక గ్రామానికి చెందిన వ్యవసాయ కూలి తోటకూర శ్రీనివాసరావు (47) కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువనేత పృథ్వీరాజ్ ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆయన వెంట సర్పంచ్ వీధి వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్ మద్దింశెట్టి దొరబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పోలిశెట్టి గణేష్, నాయకులు ఉన్నారు.

### ఆబోతుకు అంత్యక్రియలు



ఆబోతుకు అంతిమయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

**కె.గంగవరం:** మండలంలోని కోట గ్రామంలో ఆదివారం ఆబోతుకు హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. కోట గ్రామంలో సుమారు 10 సంవత్సరాల నుంచి గ్రామంలో తిరుగుతున్న ఆబోతు ఆకస్మికంగా ఆదివారం ఉదయం అకాల మరణం చెందింది. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన గోపాల మిత్ర రమేష్ ఆధ్వర్యంలో ఆబోతుకి అంతియ యాత్ర నిర్వహించి అనంతరం సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు ఈ అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

### కొబ్బరిచెట్టు పడి విద్యుత్ వైర్లు ధ్వంసం

**అంబాజీపేట:** ముక్కామల సబ్‌స్టేషన్ ఎదురుగా ప్రధాన పంట కాలువ పక్కనే ఉన్న ఓ కొబ్బరి చెట్టు ఆదివారం అర్ధరాత్రి సమయంలో విరిగి విద్యుత్ వైర్లపై పడింది. దాంతో విద్యుత్ వైర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అర్ధరాత్రి నుంచి ముక్కామల, ఇరుసుమండ, వక్కలంక, పసుపల్లి, పుల్లేటికుర్రు, వ్యాఘ్రేశ్వరం గ్రామాల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వారి సిబ్బంది, పొక్లెయిన్ సాయంతో ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

### వెంకన్న ఆలయంలో ఐపీఎస్ అధికారి

**ఆత్రేయపురం:** కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఐపీఎస్ అధికారి సుధీర్‌కుమార్ రెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయను ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### ప్రజా సమస్యల పరిష్కారానికే..

**కాజులూరు:** నియోజకవర్గ గ్రామాల్లో ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికే పోరాటాలు సాగించేందుకే 'ఇంటింటికీ జన సేన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ అన్నారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బొండా వెంకన్న ఆధ్వర్యాన తణుకువాడ నుంచి ఆదివారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

# విష జ్వరాలతో జరభద్రం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



కూళ్లలో విషజ్వరాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



పామర్రులో విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

**కె.గంగవరం:** వర్షాకాలం.. ఎక్కడ చూసినా నేల చిత్తడిగానే కనిపిస్తుంది. పైగా లోతట్టు ప్రాంతలు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటుంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే కాకుండా తాగునీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా దోమలు పెరిగి మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది. అందుకే ప్రజలు పరిసరాల శుభ్రతతో పాటు, సురక్షితమైన తాగునీరు తాగడం, దోమ తెరల వాడడం తదితర ముందు జాగ్రత్తలు తీసుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని వైద్యులు సూచిస్తున్నారు.

**పరిశుభ్రతే శ్రీరామరక్ష**

దోమల వ్యాప్తి కారణంగా మలేరియా, బోధకాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, ఇంట్లోను నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వైద్యాధికారులు చూచిస్తున్నారు. వర్షాకాల ప్రారంభ సమయంలో దోమలు గుడ్లు లార్వా దశకు చేరుకోవడం వల్ల సాధారణంగా దోమల ఉధృతి అధికంగా ఉంటుంది. నీరు నిల్వచేసిన డ్రమ్ములు, పాడైపోయిన టైర్లు, పూలకుండీలు, ఇంకుడు గుంతలు, సంపులు, పాడేసిన కొబ్బరి బొండాలు, ఫ్లవర్‌వాజ్‌లు, రుబ్బురోళ్లు, వాటర్‌ట్యాంకుల్లో దోమల లార్వా అధికంగా వ్యాప్తి చెంతుంది. దోమలను లార్వా దశలోనే అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రధానంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని సూచిస్తోంది. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సీజన్‌లతో నిమిత్తం లేకుండా డ్రైడేపై అవగాహన కల్పిస్తున్నారు.

**అప్రమత్తమైన యంత్రాంగం**

పలు గ్రామాల్లో జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఏఎన్‌ఎంలు, కమ్యూనిటీ ఆరోగ్య అధికారులు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి జ్వర లక్షణాలు ఉన్న వారందరి రక్తాన్ని సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఫ్యామిలీ మెడికల్ ప్రోగ్రాంలో భాగంగా కూడా ఇంటింటికీ డాక్టర్లు రావడంతో అక్కడిక్కడే రోగులు పరీక్షలు చేయించుకుని మందులు వాడుతున్నారు. జ్వరాలు నిర్ధారణ అయిన వారికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు సిబ్బంది ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య పనులపై పంచాయతీ, ఆరోగ్య అధికారులు సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

**డ్రై డే కచ్చితంగా పాటించాలి**



వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహారమే తీసుకోవడం, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, రోగ నిరోధక శక్తిని పెంచుకోవడం తదితర జాగ్రత్తలు అవసరం. దీంతో పాటు ప్రజలంతా ప్రతి శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలి. పంచాయతీలు కూడా కచ్చితంగా వాటర్ ట్యాంకుల శుభ్రం చేసుకోవాలి. నీటి పరీక్షలు చేయించాలి. ప్రజలకు జ్వరాలు ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీలో సిద్ధంగా ఉన్నాయి. – మాణిక్యం, వైద్యుడు, పామర్రు పీహెచ్‌సీ

### ఇస్రో శాస్త్రవేత్తలకు 'ఈ పోస్ట్'తో అభినందనలు




తపాలాశాఖ చంద్రయాన్-3 ఈ పోస్టు

**మండపేట:** చంద్రయాన్-3 సేఫ్టీ ల్యాండింగ్ ద్వారా అంతరిక్ష పరిశోధనల్లో సరికొత్త చరిత్ర సృష్టించిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపేందుకు పోస్టల్ శాఖ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్టు మండపేట పోస్టల్ ఉద్యోగి కొండపల్లి సూర్యనారాయణ తెలిపారు. కేవలం రూ.10లకు 'ఈ పోస్టు' ద్వారా చంద్రయాన్ -3 శాస్త్రవేత్తల బృందానికి శుభాకాంక్షలు తెలిపే అవకాశం కల్పిస్తోందన్నారు. ప్రతి పోస్టాఫీసులోను ఈ పోస్టు వెసులుబాటు ఉందని, వినువీధిలో భారతదేశ కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపేందుకు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రేపు శ్రీవారి నక్షత్ర కల్యాణం

**రాయవరం:** స్థానిక శ్రీ,భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 29న నక్షత్ర కల్యాణం నిర్వహించనున్నారు. స్థానిక వేంకటేశ్వర భక్త సంఘం ఆధ్వర్యంలో ప్రతి నెలా నిర్వహించే నక్షత్ర కల్యాణాల్లో భాగంగా నిర్వహిస్తున్నట్లు భక్త సంఘం ప్రతినిధులు తెలిపారు.

## సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వేంకటేశ్వరస్వామి ఆలయ పాలక మండలి ప్రమాణ స్వీకారం

**మండపేట:** ఆలయ కమిటీ సభ్యులుగా స్వామివారికి, భక్తులకు సేవ చేసే భాగ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరస్వామి వారి ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం ఆదివారం ఆలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తోట హాజరయ్యారు. చైర్మన్‌గా పట్టణానికి చెందిన ప్రముఖ స్వీట్స్ వ్యాపారి పోతంశెట్టి వీరవెంకట సత్యనారాయణ (సత్తిబాబు), సభ్యులుగా బిక్కిన శ్రీనివాస్, పట్నాల మణిదీపిక, ఏలూరి వీరసత్యనారాయణ (సుబ్బారావు), బన్నరావూరి రాజేశ్వరి, ఉప్పు వీరరంగా వెంకటలక్ష్మి, మేతర కనకమహాలక్ష్మి, శ్రీరంగం భాస్కర శ్రీనివాసాచార్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన కమిటీకి ఎమ్మెల్సీ తోట, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు అభినందనలు తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. సత్తిబాబు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు బిక్కిన చక్రవర్తి, కౌన్సిలర్లు నీలం దుర్గ, ఎర్నేని ప్రభావతి, పార్టీ నాయకులు జిన్నూరి సాయిబాబా, కుక్కల రామారావు, ముక్కా దాలయ్య, దుగ్గిరాల రాంబాబు, శీలామంతుల సత్యనారాయణ, జొన్నపల్లి సత్తిబాబు, అడబాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## బిర్యానీ పొట్లంలో బొద్దింక

- జాగ్రత్తలు పాటించని తయారీదారులు



బిర్యానీ ప్లేట్‌లో చికెన్ జాయింట్లు పక్కన బొద్దింక

**మండపేట:** ఆదివారం కదా అని సరదాగా బిర్యాని తిందామనుకున్న ఓ యువకుడికి చేదు అనుభవం ఎదురైంది. పార్శిల్ తెరవగానే అందులో బొద్దింకను చూసి ఖంగు తినడం అతడి వంతైంది. తాపేశ్వరానికి చెందిన యువకుడు స్థానిక విజయా మహల్ సమీపంలోని ఒక బిర్యాని పాయింట్‌లో పార్శిల్ కట్టించుకున్నాడు. ఇంటికి వెళ్లి తెరిచే సరికి చికెన్ జాయింట్లతో పాటు అందులోని బొద్దింకను చూసి దిమ్మ తిరిగి నట్‌లైంది. తిరిగి మండపేటలోని బిర్యానీ పాయింట్‌కు చేరుకుని నిర్వాహకుడితో గొడవపడి పార్శిల్‌ను వెనక్కి ఇచ్చి తన డబ్బులు తీసేసుకున్నట్టు ఆ యువకుడు తెలిపాడు. కాగా ఇటీవల రాజారత్న సెంటర్‌లో పేరొందిన ఒక టిఫిన్ సెంటర్ వద్ద సాంబారులో బల్లి రావడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పలు హోటళ్లలో వినియోగదారులకు ఇటువంటి అనుభవాలు ఎదురవుతున్నాయి. పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు లేకపోవడం హోటల్ వ్యాపారుల ఇష్టారాజ్యంగా మారిందన్న విమర్శలున్నాయి. కొన్ని హోటళ్లలో రోజుల తరబడి ఫ్రిజ్‌లలో నిల్వ చేసిన చికెన్, మటన్ తదితర వాటితో రకరకాల వంటకాలు చేస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్న ఉదంతాలు గతంలో వెలుగు చూశాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేయడం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలి



హాజరైన సచివాలయ కన్వీనర్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సమావేశం

**మండపేట:** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికుల్లా పని చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. నియోజకవర్గంలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఆదివారం స్థానిక సీతారామ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అబ్జర్వర్, కొడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, పార్టీ రాష్ట్ర నాయకులు కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు, కొవ్వూరి త్రినాథరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి చేకూరేలా చూడాలన్నారు. మన రాష్ట్రంలోని సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రభుత్వ పథకాలకు పేదరికమే ప్రామాణికంగా సీఎం జగన్ పారదర్శకమైన పాలన చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట పేర్కొన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, ఎంపీపీలు వుండమట్ల శ్రీనివాస్, నాడు వెంకటరమణ, అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమేశ్వరుని సన్నిధిలో మంత్రి వేణు



ద్రాక్షారామ భీమేశ్వరస్వామి సన్నిధిలో వేదాశీర్వచనం అందుకుంటున్న మంత్రి వేణు కుటుంబం



వేంకటేశ్వరస్వామికి కల్యాణం నిర్వహిస్తున్న మంత్రి వేణు దంపతులు

**రామచంద్రపురం రూరల్:** ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సతీమణి వరలక్ష్మి, కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలసి ఆదివారం దర్శించుకున్నారు. రామచంద్రపురం క్యాంపు కార్యాలయంలో శ్రీనివాస కల్యాణం అనంతరం సుమారు 50 మందికి పైగా బంధువులతో కలసి స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఆదివారం అలంకరించిన స్వర్ణ మకర తోరణం పరిశీలించి దాత పంపన లక్ష్మణకుమార్ కుటుంబాన్ని మంత్రి వేణు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు.

**వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం**

**రామచంద్రపురం:** రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ స్వగృహం వద్ద గల క్యాంపు కార్యాలయలో వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మంత్రి వేణు-వరలక్ష్మి దంపతులు స్వామికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయం, వాడపల్లి వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం నుంచి వచ్చిన అర్చకులు ఆశీర్వచనాలను అందజేశారు. గోవింద మాల ధరించిన మహిళలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం మంత్రి వేణు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుతూ స్వామికి కల్యాణాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

### గడ్డి మందు తాగి విద్యార్థి ఆత్మహత్య



కోటి అజయ్

**రామచంద్రపురం రూరల్:** పదో తరగతి విద్యార్థి గడ్డి మందు తాగి బలవన్మరణానికి పాల్పడిన దుర్ఘటన మండలంలో చోటు చేసుకుంది. ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జగన్నాయకులపాలేనికి చెందిన కోటి అజయ్ (16) స్థానిక గాయత్రి స్కూలులో పదో తరగతి చదువుతున్నాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోజనం చేసి మళ్లీ పాఠశాలకు వెళ్లాడు. పాఠశాల నుంచి ట్యూషన్‌కు వెళ్లాడు. అక్కడి నుంచి తోట వారి లేఅవుట్‌కు వెళ్లి రాత్రి సమయంలో గడ్డి మందు తాగాడు. అజయ్ రావడం లేదని చూడడానికి వెళ్లిన స్నేహితుడు అర్జున్‌కు అపస్మారక స్థితిలో కనిపించాడు. అర్జున్ అజయ్ తల్లిదండ్రులకు విషయం చేరవేయగా, అజయ్‌ను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### మద్యం మత్తులో బాలుర ఘర్షణ

**రాయవరం:** స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో ఆదివారం సాయంత్రం ఇద్దరు బాలురు పరస్పరం ఘర్షణకు దిగినట్టు తెలిసింది. రాయవరానికి చెందిన ఆ ఇరువురూ యానాంలో మద్యంలో సేవించి వచ్చి బస్‌స్టాండ్ సెంటర్‌లో చిన్నపాటి తగాదాతో ఘర్షణకు దిగారు. ఇరువురు బాలుర ఘర్షణను సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాలురుల్లో ఒకరు చాకుతో దాడి చేసినట్టు సమాచారం. గాయపడిన వ్యక్తిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తెలిసింది. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని రాయవరం పోలీసులు తెలిపారు.

## గ్రామీణులకు కంటి వైద్య సేవలే లక్ష్యం



కపిలేశ్వరపురంలో ఆసుపత్రి ప్రగతిని వివరిస్తున్న నిర్వాహకులు, వైద్యులు

**కపిలేశ్వరపురం:** గ్రామీణులకు కంటి వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా కపిలేశ్వరపురంలోని ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్, గొడవర్తి సత్యనారాయణమూర్తి వైద్య కేంద్రం కృషి చేస్తోందని ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో ఆదివారం ఆసుపత్రి 13వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి నిర్వాహకులు గొడవర్తి వీరభద్ర చౌదరి, వైస్ చైర్మన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి, సెకండరీ సెంటర్స్ హెడ్ జ్యోతిప్రసాద్, స్థానిక సెంటర్ హెడ్ వాసుబాబు, మాట్లాడుతూ ఆసుపత్రి ఏర్పాటు లక్ష్యం సంతృప్తికరంగా సాగుతోందన్నారు. ఏడాదిలో 12,500 మందికి నేత్ర వైద్య సేవలు అందించామని, మరో 1,350 మందికి కాటరాక్ట్ శస్త్రచికిత్సలు చేశామన్నారు. రానున్న ఏడాది 1,850 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు చేయాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు.

## వీరభద్రపురంలో బస్‌షెల్టర్ ప్రారంభం



బస్‌షెల్టర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ తోట, చైర్‌పర్సన్ దుర్గారాణి తదితరులు

**మండపేట:** పట్టణంలోని వీరభద్రపురంలో మండపేట–రామచంద్రపురం కెనాల్ రోడ్డుపై నిర్మించిన దాసరి రామారావు బస్‌షెల్టర్‌ను ఆదివారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రారంభించారు. 1వ వార్డు పరిధిలోని వీరభద్రపురం వద్ద కనీసం నిలువ నీడ లేక ప్రయాణికులు ఎండకు వానకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం కెనాల్‌ను ఆనుకుని దాసరి అన్నపూర్ణ తన భర్త రామారావు పేరిట రూ.7.5 లక్షలు వెచ్చించి షెల్టర్ నిర్మాణం చేయించారు. ఈ సందర్భంగా రామారావు కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ తోట అభినందించారు. షెల్టర్ నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్సీ తోటను మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, రామారావు కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, దాసరి వీరభద్రరావు, పేపర్తి సాంబమూర్తి, దాసరి వెంకన్న, కృష్ణంరాజు, దాసరి శ్రీను, జాగు నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.

### ఆలమూరు ఎస్సైగా శ్రీనివాస నాయక్

**ఆలమూరు:** స్థానిక పోలీసుస్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎల్.శ్రీనివాస నాయక్ నియమితులయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సోమన శివప్రసాద్ బదిలీపై ముమ్మిడివరం ఎస్సైగా వెళ్లారు. ప్రస్తుతం అల్లవరం ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్.శ్రీనివాస నాయక్ ఆలమూరు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ ఆదివారం వెల్లడించారు.

## భీమేశ్వరాలయంలో గుడిగుడికీ అర్చక సమాఖ్య



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గుడి గుడికీ అర్చక సమాఖ్య కార్యక్రమం ప్రారంభిస్తున్న మంత్రి వేణు, వరలక్ష్మి దంపతులు

**రామచంద్రపురం రూరల్:** దేవాలయాల అభివృద్ధి, అర్చక సంక్షేమం అంశాలపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న 19 విప్లవాత్మక నిర్ణయాలపై భక్తులకు, అర్చకులకు అవగాహన కల్పించే విధంగా చేపట్టిన 'గుడి గుడికీ అర్చక సమాఖ్య' కార్యక్రమం ఆదివారం ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో నిర్వహించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ దంపతులు ప్రారంభించారు. గత నెల 20న దేవాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవాదాయ శాఖ కమిషనర్, దేవాదాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి శ్రీరామ సత్యనారాయణ, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దింటి రాంబాబు, ప్రధాన కార్యదర్శి కోటపాడు శ్రీనివాసులు, రాష్ట్ర అర్చక సంఘం సభ్యులతో కలసి తీసుకున్న నిర్ణయాల ప్రకారం ప్రభుత్వ సహకారాన్ని పూర్తి స్థాయిలో అందుకునేలా అవగాహన కలిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళ్లేపల్లి ఫణికుమార్, కాకాని కృష్ణకుమార్, వల్లి, వెలవలపల్లి సుబ్రహ్మణ్యశివాచార్య, పెద్దింటి కృష్ణమాచార్యులు, చక్రవర్తుల గోపి, ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయ అర్చకులు పాల్గొన్నారు.